వాన రాకున్నా వరద!

- బస్తీలు జలమయం
- రూ.45 కోట్లతో నాలా అభివృద్ధి పనులు
- అయినా.. ముంపులోనే పరిసరాలు
- భయం గుప్పెట్లో బేగంపేటలోని బ్రాహ్మణవాడి, అల్లంతోటబావి

బేగంపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వానొస్తే.. వరద వస్తుంది. అయితే, ఇక్కడ వాన రాకపోయినా వరద వస్తుంది. ఎగువన కురిసిన వర్షాలకు కూకట్‌పల్లి నాలా నుంచి పెద్ద ఎత్తున వరదనీరు రావడంలో ఇక్కడ లోతట్టు ప్రాంతాలు నీటమునుగుతున్నాయి. వర్షాకాలం వస్తుందంటే ఇక్కడి వారు వణికిపోతారు. రెండు నెలలుగా కురుస్తున్న భారీ వర్షాలకు వందలాది ఇళ్లు నీటమునగడమే కాకుండా ఎందరో నిరాశ్రయులయ్యారు. కొన్ని సంవత్సరాలుగా వర్షాకాలంలో వరదముంపు ఉన్నప్పటికీ కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలు బేగంపేటలోని బ్రాహ్మణవాడి, అల్లంతోటబావి ప్రాంతాల వారికి కంటి మీద కునుకు లేకుండా చేశాయి. ఈ ప్రాంతాల్లో సివరేజీ.. వర్షపు నీటి పైపులైన్ల నిర్మాణంలో లోపాల వల్లనే వరద సమస్య ఏర్పడుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. బస్తీల నుంచి వెళ్లే చిన్న సివరేజీ లైన్లలో హోటళ్లు, వ్యాపార సముదాయాలకు చెందిన మురుగునీటి పైపులను కలపడంతో వాటి సామర్థ్యం సరిపోక చిన్నపాటి వర్షం పడినా ఇళ్లలోకి వర్షంనీరు చేరుతుంది.

వర్షం నీరు వెళ్లే దారి లేక..

అల్లంతోటబావిలోని ఆర్కే టవర్స్ ముందు ప్రాంతంలో పెద్ద ఎత్తున వర్షాలు కురిసినప్పుడు వర్షంనీరు ఇక్కడ నుంచి సమీపంలోని ద్వారకాదాస్ నాలాలోకి వెళ్తుంది. నాలా ఉధృతంగా ప్రవహించినప్పుడు బస్తీ ఆనుకుని ఉన్న ఖాళీ స్థలం నుంచి వరదనీరు వెళ్తుంది. కొన్ని సంవత్సరాలుగా ఈ ఖాళీ స్థలంలో పెద్ద ఎత్తున మట్టిని డంప్ చేయడంతో నీరు వెళ్లే అవకాశం లేకుండా పోయింది. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా ఇక్కడ ఉన్న వందలాది ఇళ్లు నీట మునుగుతున్నాయి. 2016 సెప్టెంబర్ 21న కురిసిన వర్షానికి ఈ ప్రాంతంలో 5 నుంచి 6 అడుగుల మేర వరదనీరు చేరింది. ఇక్కడ నీరు వెళ్లే అవకాశం లేకపోవడంతోపాటు కూకట్‌పల్లి నాలా నుంచి పెద్ద ఎత్తున వరద నీరు పైపులైన్ల నుంచి రివర్స్‌లో రావడంతో ఈ ప్రాంతం వరదలకు నిలయంగా మారింది.



అల్లంతోటబావిలో చేరిన వరదనీరు (పాత చిత్రం)



బ్రాహ్మణవాడిలోని లేన్ నంబర్.3లో చేరిన వరదనీరు

కుందన్‌బాగ్, లైఫ్‌స్టైల్ ప్రాంతాల నుంచి బేగంపేట రైల్వేస్టేషన్ పట్టాల కింద నుంచి బ్రాహ్మణవాడిలోకి వర్షం పడిన ప్రతీసారి భారీ ఎత్తున వర్షంనీరు వస్తుంది. దీంతో వర్షం నీరు వెళ్లేందుకు అవసరమైన పైపులైన్ లేకపోవడంతో ఈ వరదనీరు వడ్డెరబస్తీ, బ్రాహ్మణవాడిలోని పలు ఇళ్లను ముంచెత్తుతోంది.

ప్రత్యేక ఏర్పాట్లు చేయకపోవడం వల్లే..

బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎస్ఎన్‌డీపీ పథకం ద్వారా రూ.45 కోట్లతో నాలా అభివృద్ధి పనులు నిర్వహించారు. పనులు పూర్తయితే ఈ ప్రాంతంలో ముంపు సమస్య పూర్తిగా తొలగిపోతుందని అప్పట్లో ప్రజాప్రతినిధులు ప్రజలకు చెప్పారు. నాలా పనులు పూర్తయినా ఇక్కడ వారికి ముంపు సమస్య నుంచి విముక్తి లభించలేదు. ప్రధానంగా నాలా పక్కన ఉన్న వడ్డెరబస్తీ, బ్రాహ్మణవాడిలోని 1,2,3,4 లేన్స్‌లో పలు ఇళ్లలోకి ఇప్పటికీ వరదనీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం నీరు వెళ్లేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయకపోవడం వల్లనే ఇక్కడ వరదనీరు ఇళ్లలోకి వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నామమాత్రంగా పూడికతీత

బేగంపేటలోని వరుణ్ మోటార్స్ నుంచి హుస్సేన్‌సాగర్ వరకు బేగంపేట మీదుగా ప్రవహించే కూకట్‌పల్లి నాలాలో ప్రతీ సంవత్సరం పూడికతీత పనుల కోసం సుమారు కోటి రూపాయలను అధికారులు ఖర్చు చేస్తున్నారు. నామమాత్రంగా ఇక్కడ పనులు జరుగుతున్నాయి. నాలాలో పెద్ద ఎత్తున మట్టి పేరుకుపోయింది. సుమారు 3 అడుగుల మేర తీయాల్సిన పూడికతీత పనులను పైపైన చేయడంతో వరదలు వచ్చినపుడు వరదనీరు బస్తీలను ముంచెత్తుతోంది. కొన్ని సంవత్సరాలుగా లక్షల వ్యయంతో పూడికతీత కోసం నిధులు ఖర్చు చేస్తున్నారు. బ్రాహ్మణవాడి నుంచి మాతాజీనగర్ వరకు నాలాలో 5 నుంచి 6 అడుగుల మేర పెద్ద ఎత్తున మట్టి పేరుకు పోయింది.

నాలా బఫర్ జోన్లలోని నిర్మాణాలతోనే సమస్య

కూకట్‌పల్లి నాలాకు ఇరువైపులా ఉన్న బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాల వల్లే వర్షం నీరు వెళ్లే అవకాశాలు లేక తరచూ ఈ ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. నాలాను ఆనుకుని గతంలో ఇక్కడ భారీ భవనాలను నిర్మించారు. 2016 సెప్టెంబర్ 20వ తేదీ నుంచి రెండు రోజులపాటు కురిసిన భారీ వర్షాలకు ఈ ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. మయూరి మార్గంలో 5 అడుగుల మేర నీరు చేరడంతో వెనుకన ఉన్న బస్తీలకు సంబంధాలు తెగిపోయాయి. నాలా పక్కన ఉన్న అల్లంతోటబావి ప్రాంతంలో వందలాది ఇళ్లు నీట మునిగాయి. స్థానికులతో పాటు సైన్యం రంగంలోకి దిగి వరదల్లో చిక్కుకున్న వారిని రిలీఫ్ క్యాంపులకు తరలించారు. వరదనీటిలో చిక్కుకున్న అల్లంతోటబావి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు మిలటరీ కమాండర్ అనుకోశ్‌పాండే నేతృత్వంలో సుమారు 35 మంది ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యల్లో అప్పట్లో పాల్గొన్నాయి. వరదముంపు నివారణకు ఈ ప్రాంతంలో ఉన్న నాలాల ఆక్రమణలను తొలగించాలని అప్పట్లో అధికారులు నిర్ణయించారు. అయితే, సర్వే చేసి మార్కింగ్ వేసి వదిలేశారు. నాలాకు బ్రాహ్మణవాడి వైపున, అల్లంతోటబావి వైపున ఉన్న ఆక్రమణలను గుర్తించిన ఇంజనీరింగ్ అధికారులు అప్పట్లో మార్కింగ్ చేశారు. ఇంతవరకూ ఆక్రమణలను తొలగించలేదు. దీనికితోడు బ్రాహ్మణవాడి నుంచి మాతాజీనగర్ వరకు నాలా పొడవునా బఫర్ జోన్‌లో భారీ ఎత్తున నిర్మాణాలు వెలిశాయి. వీటిని తొలగించడంలోనూ అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం ప్రదర్శించడం వల్లనే ఇక్కడ వరద సమస్య తీవ్రంగా ఉందనే విమర్శలున్నాయి.

వైద్య విద్యార్థినిపై హత్యాచారం చేసిన వారిని ఉరి తీయాలి

- బీఆర్ఎస్ నాయకురాలు ఉప్పలపాటి అనూషరామ్



అనూషరామ్

బంజారాహిల్స్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కోల్‌కతా ఆర్జికర్ ఆస్పత్రిలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం చేసి అతి కిరాతకంగా హత్య చేసిన నిందితులను బహిరంగంగా ఉరి తీయాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు ఉప్పలపాటి అనూషరామ్ డిమాండ్ చేశారు. జూబ్లీహిల్స్‌లో గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. నిందితులు ఎంతటి వారైనా కఠిన శిక్ష విధించాలన్నారు. మరొకరు ఇలాంటి ఘటనలకు పాల్పడకుండా కఠిన శిక్షలు సత్వరం విధించేలా కేంద్ర ప్రభుత్వం చట్టాలను రూపొందించాలని డిమాండ్ చేశారు.



హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్‌గా కోట శ్రీవత్స బాధ్యతలు స్వీకరించారు. గురువారం అమీర్‌పేట్ స్వర్ణజయంతి కాంప్లెక్స్‌లోని హెచ్ఎండీఏ ప్రధాన కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌ను ఆయన ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు.

- హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి

వెంగళరావునగర్, షేక్‌పేట డివిజన్‌లకు చెందిన లబ్ధిదారులతో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

- బంజారాహిల్స్, ఆంధ్రజ్యోతి



స్కిల్ డెవలప్‌మెంట్‌లో బీసీ నిరుద్యోగ యువతకు శిక్షణ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఫ్రీ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ప్రోగ్రాం కింద బీసీ నిరుద్యోగ యువతకు 90 రోజులపాటు నాన్ రెసిడెన్షియల్ కింద శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి అధికారి ఆశన్న తెలిపారు. కుషాయిగూడలోని ఎల్‌జీ హోప్ టెక్నికల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1 నుంచి నవంబర్ 30 వరకు వంద మంది అభ్యర్థులకు ట్రైనింగ్ అందిస్తున్నట్లు చెప్పారు. శిక్షణ పూర్తయిన తర్వాత ప్లేస్‌మెంట్‌లు లభిస్తాయన్నారు. టెన్త్, ఇంటర్ పూర్తిచేసిన 18 నుంచి 25 ఏళ్లలోపు ఉన్న అభ్యర్థులు ఈనెల24లోపు www.tgbcstudycircle.cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.5 లక్షలలోపు ఉండాలని, ఎస్ఎస్‌సీ మార్కుల మెరిట్ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు.

రేపు ఈఎంఆర్ఐలో ఉద్యోగ ఇంటర్వ్యూలు

మేడ్చల్ టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఈఎంఆర్ఐ(108) సంస్థలో డ్రైవర్లు, మెడికల్ టెక్నీషియన్ల నియామకాలను చేపడుతున్నట్లు ఈఎంఆర్ఐ ప్రోగామ్ మేనేజర్ షేక్ జాన్ షాహీద్ తెలిపారు. ఈనెల 24న కింగ్‌కోఠి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని తమ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికేట్లతో పాటు ఒక జత జీరాక్స్ సెట్‌ను తీసుకురావాలని సూచించారు.



అభివాదం చేస్తున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నేతలు

మనువాదులతో మందకృష్ణ సహజీవనం

- మాదిగ జాతిని బీజేపీకి తాకట్టు పెడుతున్నారు
- మాలలు అంబేడ్కరిస్టులు: జి.చెన్నయ్య

పంజాగుట్ట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మనువాదులతో మంద కృష్ణ మాదిగ సహజీవనం చేస్తూ.. మాదిగ జాతిని మనువాద బీజేపీ, ప్రధాని నరేంద్ర మోదీకి తాకట్టు పెడుతున్నారని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కో కన్వీనర్ జి.చెన్నయ్య ఆరోపించారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమితి నేతలు చెరుకు రాంచందర్, బూర్గుల వెంకటేశ్వర్లు తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా ఈనెల 21న చేపట్టిన భారత్ బంద్‌కు మంచి స్పందన వచ్చిందన్నారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తున్న మాల మేధావులంతా మనువాదులేనని మంద కృష్ణ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని చెప్పారు. 'మాలలు మనువాదులు కాదు.. అంబేడ్కరిస్టులు.. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం మా పక్షాన ఉంది. వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధం. మనువాదానికి అనుకూలంగా ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తున్నాం.. సుప్రీంకోర్టు తీర్పుపై రివ్యూ పిటిషన్ వేశాం. అంబేడ్కర్ వాదమే గెలుస్తుంది' అని వ్యాఖ్యానించారు.



రాహత్ క్రైసిస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న క్రిస్టినా స్కాట్, గారెత్ విన్ ఓవెన్

మహిళలను ఆదుకోవడమే రాహత్ క్రైసిస్ కేంద్రం లక్ష్యం

అఫ్జల్‌గంజ్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గృహహింస వలయంలో చిక్కుకున్న మహిళలను ఆదుకోవడమే రాహత్ క్రైసిస్ కేంద్రం లక్ష్యమని బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ క్రిస్టినాస్కాట్, తెలంగాణ-ఏపీ బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్ పేర్కొన్నారు. ఆబిడ్స్‌లోని ఫెర్నాండెజ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాహత్ క్రైసిస్ కేంద్రాన్ని వారు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గృహహింస నుంచి బయటపడిన మహిళలకు రాహత్ క్రైసిస్ కేంద్రం అవసరమైన సాయం అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన



కంటి పరీక్షలు చేస్తున్న సిబ్బంది

పంజాగుట్ట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ కాలనీ సంక్షేమ సమితి, ఐసీఐసీఐ బ్యాంక్ కళ్యాణ్‌నగర్ శాఖ ఆధ్వర్యంలో వాసన్ ఐ కేర్ ఆస్పత్రి, ఆర్థో స్క్వేర్ ఆస్పత్రి సహకారంతో గురువారం సంక్షేమ సమితి కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చింది. కంటి, దంత, చెవి పరీక్షలు చేశారు. బ్యాంక్ మేనేజర్ నాగేశ్వర్‌రెడ్డి, సమితి ప్రధాన సలహాదారు దేవిరెడ్డి నాగార్జునరెడ్డి, అధ్యక్షుడు చిలకల వెంకటేశ్వరరావు, నాయకులు పి.ఎస్.రాజు, కె.రాజశేఖర్‌గుప్తా, ముత్తయ్య జి.రాజశేఖర్, శివ, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

శిశువిహార్ ఆయాలకు వేతనాలు చెల్లించాలి

పంజాగుట్ట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): యూసు‌ఫ్‌గూడ ప్రధాన రహదారిలోని తెలంగాణ రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యాలయం ఆవరణలోని శిశువిహార్‌లో పనిచేస్తున్న ఆయాలకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని శిశువిహార్ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) కార్యనిర్వాహక అధ్యక్షుడు రాపర్తి అశోక్ డిమాండ్ చేశారు. ఆయాలకు రెండు నెలల వేతనాలు చెల్లించాలని కోరుతూ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ ఆయాలకు జూన్, జూలై వేతనాలు చెల్లించకపోవడంతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రతి నెలా మొదటి వారంలో వేతనాలు చెల్లించాలని కోరారు. యూనియన్ నాయకులు తార, సుశీల, జయశ్రీ ఆయన వెంట ఉన్నారు.

యూరోపియన్ విశ్వవిద్యాలయాల్లో మెరుగైన విద్యావకాశాలు



విద్యార్థులకు సందేహాలను నివృత్తి చేస్తున్న యూరోపియన్ విశ్వవిద్యాలయాల ప్రతినిధులు

బంజారాహిల్స్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): యూరోపియన్ విశ్వవిద్యాలయాల్లో మెరుగైన విద్యావకాశాలు అందుబాటులోకి వచ్చాయని యూఎస్ విశ్వవిద్యాలయాల ప్రతినిధులు తెలిపారు. బంజారాహిల్స్ రాడిసన్ బ్లూ హోటల్‌లో కేరీర్ మొజాక్ ఆధ్వర్యంలో యూఎస్‌కు చెందిన 25 విశ్వవిద్యాలయాల ప్రతినిధులతో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అక్కడ అందించే విద్య, కొత్త కోర్సులు, స్కాలర్‌షిప్, విద్యార్థుల భద్రతపై ప్రతినిధులు స్పష్టత ఇచ్చారు. విదేశీ విద్య విషయంలో తెలంగాణ, ఏపీ విద్యార్థుల సంఖ్య ప్రతి యేటా గణనీయంగా పెరుగుతుందని కేరీర్ మొజాక్ వ్యవస్థాపకుడు అభిజిత్ జవేరి తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 12-14 శాతం మంది విద్యార్థులు వస్తున్నారని, 2023-24కు 1.6 లక్షల దరఖాస్తులు అందాయని చెప్పారు. కంప్యూటర్‌సైన్స్, డేటా సైన్స్‌తోపాటు హెల్త్ సైన్స్, సైకాలజీ వంటి కోర్సులకు కూడా ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు.

26న జలవిహార్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాధ, నర్రా లక్ష్మి, అనిల్, తదితరులు

పంజాగుట్ట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మాధవసేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 26న నెక్లెస్‌రోడ్డులోని జలవిహార్ గ్రాండ్ లాన్స్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను నిర్వహిస్తున్నామని ఫౌండేషన్ అధ్యక్షురాలు, ప్రముఖ సైకాలజిస్ట్ కాకర్ల రాధ తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ అధ్యక్షురాలు నర్రా లక్ష్మి, మేడారం ప్లాంటేషన్ ఫెస్టివల్ ప్రతినిధి అనిల్, వెంకటేష్, రోహన్, తదితరులతో కలిసి ఆమె శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాధ మాట్లాడుతూ ఉదయం నుంచి రాత్రి వరకు ఆధ్యాత్మిక, వినోదాత్మక కార్యక్రమాలు, డ్రాయింగ్ పోటీలు, అన్నప్రసాదం, మ్యూజిక్ డైరెక్టర్ ధృవన్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక పాటల కార్యక్రమం, డీజే గాయకులతో డీజే స్పిరిచువల్ మ్యూజిక్ ఈవెంట్, సరిపోదా శనివారం మూవీ బృందంతో సరదా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

అందుబాటులోకి మెట్రో డీలక్స్ మంత్లీ పాస్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ జోన్ ప్రయాణికుల సౌకర్యార్థం గురువారం నుంచి మెట్రో డీలక్స్ మంత్లీ బస్‌పాస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు టీజీఎస్ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వర్లు తెలిపారు. పాస్‌తో మెట్రోడీలక్స్, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఈ-మెట్రో ఎక్స్‌ప్రెస్ నాన్ ఏసీ, సిటీ ఆర్డినరీ బస్సుల్లో ప్రయాణించవచ్చన్నారు. పాస్‌హోల్డర్లు సిటీ, సబర్బన్ పరిధుల్లో తిరిగే అన్ని బస్సుల్లో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ప్రయాణించవచ్చన్నారు.

ఏఐ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

బర్కత్‌పుర, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నేషనల్ కంప్యూటింగ్ కౌన్సిల్ ఆధ్వర్యంలో యువతకు, విద్యార్థులకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్ కోర్సుల్లో శిక్షణకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని సంస్థ డైరెక్టర్ అడపా వెంకటరెడ్డి తెలిపారు. ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, డిప్లొమా, పీజీ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈనెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 9505800047లో సంప్రదించాలని సూచించారు.



విలేకరుల సమావేశంలో ముదిరాజ్ నాయకులు

26న కృష్ణస్వామి జయంతి వేడుకలు

పద్మారావునగర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగర తొలి మేయర్ కొర్వి కృష్ణస్వామి జయంతి వేడుకలను ఈనెల 26వ తేదీన సికింద్రాబాద్‌లోని ముదిరాజ్‌భవన్‌లో ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సికింద్రాబాద్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిర్వాహకులు డి.సదానంద్, జి.దివాకర్, శ్రీకాంత్, సురేష్, నర్సింగరావులు మాట్లాడుతూ తెలంగాణ ముదిరాజ్ మహాసభ, కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ జయంతి మహోత్సవ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వేడుకకు ముఖ్య అతిథిగా తెలంగాణ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు, మాజీ శాసనమండలి సభ్యుడు కాసాని జ్ఞానేశ్వర్ హాజరవుతారని తెలిపారు.

తల్లిదండ్రులు మందలించారని ముంబైకి వెళ్లబోయిన బాలిక

- నాంపల్లి రైల్వేస్టేషన్‌లో చేరదీసిన ఆర్పీఎఫ్ పోలీసులు



బాలికను చేరదీసిన నాంపల్లి ఆర్పీఎఫ్ పోలీసులు

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు మందలించారన్న నెపంతో ఓ బాలిక గుట్టుచప్పుడు గాకుండా ముంబైకి వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా ఆర్పీఎఫ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నాంపల్లి ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కల్పన తెలిపిన వివరాల ప్రకారం.. హయత్‌నగర్‌కు చెందిన మహ్మద్ జహంగీర్ కుమార్తె(17) కుటుంబ సమస్యలు, తల్లిదండ్రులు మందలిస్తున్నారని మనస్తాపం చెందింది. గురువారం ఎవరికీ చెప్పకుండా ఒంటరిగానే ముంబైకి వెళ్లేందుకు నాంపల్లి రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. ఆ సమయంలో పెట్రోలింగ్ చేస్తు న్న ఆర్పీఎఫ్ పోలీసులు బాలికను చేరదీసి వివరాలను సేకరించారు. బాలికను ప్రభుత్వ చైల్డ్‌లైన్ హోమ్‌కు తరలించారు. తల్లిదండ్రులకు కుమార్తెను అప్పగించేందుకు చైల్డ్‌లైన్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారని పోలీసులు తెలిపారు.

భార్యతో విడాకులు.. మళ్లీ పెళ్లి చేసుకోవాలని బెదిరింపులు

యూసుఫ్‌గూడ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): విడాకులు తీసుకున్న భార్యను మళ్లీ పెళ్లి చేసుకోకపోతే చంపేస్తానంటూ బెదిరించిన యువకుడిపై మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిగూడకు చెందిన యువతికి అదే ప్రాంతానికి చెందిన వై.శివకుమార్‌తో 2019లో వివాహమైంది. రెండేళ్ల తర్వాత మనస్పర్థలు రావడంతో కోర్టులో విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి తల్లిదండ్రుల వద్ద ఉంటున్న ఆ యువతిని ఏడాది క్రితం నుంచి శివకుమార్ తనను మళ్లీ పెళ్లి చేసుకోవాలని వేధిస్తున్నాడు. ఈ క్రమంలో ఏప్రిల్‌లో అర్ధరాత్రి ఆమె నివసిస్తున్న ఇంటికి వచ్చి తన వద్దకు మళ్లీ రావాలని, తనను పెళ్లి చేసుకోవాలని, లేదంటే చంపేస్తానంటూ బెదిరించాడు. దీంతో ఆమె మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి కొన్నాళ్లు ఆమె వెంట పడడం మానేశాడు. ఈ నెల 5వ తేదీన ఆమె నిర్వహిస్తున్న దుకాణానికి వచ్చి గొడవ చేశాడు. వర్కర్ అడ్డుకోగా అతడిపై దాడి చేశాడు. అంతేగాకుండా మరుసటి రోజు నుంచి రోజూ వచ్చి గొడవ చేస్తున్నాడు. దీంతో విసిగిపోయిన ఆమె మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ల్యాప్‌టాప్, గోల్డ్‌చైన్ మాయం

యూసుఫ్‌గూడ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గదిలో ఉంచిన ల్యాప్‌టాప్, గోల్డ్‌చైన్ మాయమైంది. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాళహస్తికి చెందిన సోమశంకర్ వెంగళరావునగర్‌లోని హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నాడు. ఈనెల 20వ తేదీ రాత్రి ల్యాప్‌టాప్‌తో పని పూర్తయిన తర్వాత తన బ్యాగ్‌లో పెట్టి నిద్రపోయాడు. ఉదయం లేచి చూడగా ల్యాప్‌టాప్‌తో పాటుగా గోల్డ్ చైన్ కూడా కనిపించకపోవడంతో మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఇంటి శుభ్రతతో వ్యాధులకు చెక్



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో ఇంటిని శుభ్రంగా ఉంచుకోవాలని, లేకపోతే వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందంటున్నారు చెఫ్ కునాల్ కపూర్. ఇంటిని శుభ్రంగా ఉంచుకోవడానికి వినూత్న పద్ధతులను అనుసరించాలని సూచిస్తున్నారు. వేపనూనెతో ఫ్లోర్‌ను శుభ్రం చేయడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయంటున్నారు.

ఫ్లోర్ పొడిగా ఉండాలి

వర్షాకాలంలో తేమ అధికంగా ఉంటుంది. తేమ వాతావరణంలో కంటికి కనిపించని సూక్ష్మజీవులు అధికంగా వృద్ధి చెందే అవకాశాలున్నాయి. వీలైనంత వరకు ఫ్లోరింగ్ పొడిగా ఉండేలా చూసుకోవాలి. నునుపుగా ఉండే టైల్స్‌పై నీరు పడితే కాలు జారే ప్రమాదం ఉంటుంది. ఫ్లోరింగ్ తడిగా ఉంటే ఎప్పటికప్పుడు తుడిచివేయడం మంచిది.

డోర్ మ్యాట్స్..

చాలామంది వర్షాకాలంలో డోర్ మ్యాట్స్ తడిచిపోతాయని సరిగా వాడరు. ఈ సీజన్‌లో హెవీ డ్యూటీ రబ్బర్ డోర్ మ్యాట్ బయటవైపు ఉంచడంతోపాటు ఇంటి లోపల నీరు పీల్చుకునే డోర్ మ్యాట్ వాడటం వల్ల ఇల్లు శుభ్రంగా ఉంచుకోవచ్చు.

డాగ్ ప్రేమికులు జాగ్రత్తగా ఉండాలి

ఇటీవల కాలంలో చాలా మంది కుక్కలు లేదా పిల్లులను పెంచుతున్నారు. వర్షాకాలంలో వాటి కాళ్లు తడవడం వల్ల నేలపై మరకలు పడటంతోపాటు వాటికి అంటువ్యాధులు వచ్చే అవకాశాలున్నాయి. వాటి పాదాలు శుభ్రం చేయడంతోపాటు పెట్ ఫ్రెండ్లీ ఫ్లోర్ క్లీనర్ వాడాలి.

యాసిడ్, ఫినాయిల్

ఫ్లోర్‌పై మరకలు పోవడానికి కొంతమంది యాసిడ్, ఇల్లు శుభ్రం చేయడానికి ఫినాయిల్ వాడుతుంటారు. వాటివల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. కొంతమందికి చర్మ సమస్యలు లాంటివి రావచ్చు. అనారోగ్యం కలిగించే వాటిని వాడకుండా చర్మ ఆరోగ్యం పాడవకుండా ఉండే, ఘాటు వాసన లేని క్లీనర్స్‌ను వాడితే మంచిది.

- వర్షాకాలంలో మంచాలపై దుప్పట్లను వారాల తరబడి మార్చకపోతే సమస్యలు రావచ్చు. మీతోపాటు మీ పెట్స్ కూడా తాజాగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంటిలో ఎక్కడా నీరు నిల్వకుండా చూసుకోవాలి. వర్షాకాలంలో తడిచిన దుస్తులు వాసన వస్తుంటాయి. వాటిని ఆరబెట్టడానికి చర్యలు తీసుకోవాలి.

తలుపులు మూసి ఉంచొద్దు

దోమలు వస్తాయని, జల్లు పడుతుందని ఇంటి తలుపులు, కిటికీలను వర్షాకాలంలో మూసి ఉంచొద్దు. ఇంట్లో ఉన్న తేమ, ఇతర చెడు వాసనలు బయటకు పోవడానికి గాలి ప్రసరించడం అవసరం. ఇంట్లో తేమ నివారణకు హ్యుమిడిఫైయర్లు లేదా ఫ్యాన్లను వాడటం మంచిది.

వాన రాకున్నా వరద..!



అల్లంతోటబావిలో చేరిన వరదనీరు (ఫైల్‌ఫొటో)

- రూ.45 కోట్లతో నాలా అభివృద్ధి పనులు
- అయినా.. ముంపులోనే పరిసరాలు
- భయం గుప్పిట్లో బ్రాహ్మణవాడి, అల్లంతోటబావి బస్తీలు

వానొస్తే.. వరద వస్తుంది. అయితే, ఇక్కడ వాన రాకపోయినా వరద వస్తుంది. ఎగువన కురిసిన వర్షాలకు కూకట్‌పల్లి నాలా నుంచి పెద్ద ఎత్తున వరదనీరు రావడంలో ఇక్కడ లోతట్టు ప్రాంతాలు నీటమునుగుతున్నాయి. వర్షాకాలం వస్తుందంటే ఇక్కడి వారు వణికిపోతారు. రెండు నెలలుగా కురుస్తున్న భారీ వర్షాలకు వందలాది ఇళ్లు నీటమునగడమే కాకుండా ఎందరో నిరాశ్రయులయ్యారు. కొన్ని సంవత్సరాలుగా వర్షాకాలంలో వరదముంపు ఉన్నప్పటికీ కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలు బేగంపేటలోని బ్రాహ్మణవాడి, అల్లంతోటబావి ప్రాంతాల వారికి కంటి మీద కునుకు లేకుండా చేశాయి. ఈ ప్రాంతాల్లో సివరేజీ... వర్షపు నీటి పైపులైన్ల నిర్మాణంలో లోపాల వల్లనే వరద సమస్య ఏర్పడుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. బస్తీల నుంచి వెళ్లే చిన్న సివరేజీ లైన్లలో హోటళ్లు, వ్యాపార సముదాయాల మురుగునీటి పైపులను కలపడంతో వాటి సామర్థ్యం సరిపోక చిన్నపాటి వర్షం పడినా ఇళ్లలోకి వర్షంనీరు చేరుతుంది.

- బేగంపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి)

నామమాత్రంగా పూడికతీత

బేగంపేటలోని వరుణ్ మోటార్స్ నుంచి హుస్సేన్‌సాగర్ వరకు బేగంపేట మీదుగా ప్రవహించే కూకట్‌పల్లి నాలాలో ప్రతీ సంవత్సరం పూడికతీత పనుల కోసం సుమారు కోటి రూపాయలను అధికారులు ఖర్చు చేస్తున్నారు. నామమాత్రంగా ఇక్కడ పనులు చేయడంతో నాలాలో పెద్ద ఎత్తున మట్టి పేరుకుపోయింది. సుమారు 3 అడుగుల మేర తీయాల్సిన పూడికతీత పనులను పైపైన చేయడంతో వరదలు వచ్చినపుడు వరదనీరు బస్తీలను ముంచెత్తుతోంది. కొన్ని సంవత్సరాలుగా లక్షల వ్యయంతో పూడికతీత కోసం నిధులు ఖర్చు చేస్తున్నారు. బ్రాహ్మణవాడి నుంచి మాతాజీనగర్ వరకు నాలాలో 5 నుంచి 6 అడుగుల మేర పెద్ద ఎత్తున మట్టి పేరుకుపోయింది.

వర్షం నీరు వెళ్లే దారి లేక..

అల్లంతోటబావిలోని ఆర్కే టవర్స్ ముందు ప్రాంతంలో పెద్ద ఎత్తున వర్షాలు కురిసినప్పుడు వర్షం నీరు ఇక్కడ నుంచి సమీపంలోని ద్వారకాదాస్ నాలాలోకి వెళ్తుంది. నాలా ఉధృతంగా ప్రవహించినప్పుడు బస్తీ అనుకుని ఉన్న ఖాళీ స్థలం నుంచి వరదనీరు వెళ్తుంది. కొన్ని సంవత్సరాలుగా ఈ ఖాళీ స్థలంలో పెద్ద ఎత్తున మట్టిని డంప్ చేయడంతో నీరు వెళ్లే అవకాశం లేకుండా పోయింది. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా ఇక్కడ ఉన్న వందలాది ఇళ్లు నీట మునుగుతున్నాయి. 2016 సెప్టెంబర్ 21న కురిసిన వర్షానికి ఈ ప్రాంతంలో 5 నుంచి 6 అడుగుల మేర వరదనీరు చేరింది. ఇక్కడ నీరు వెళ్లే అవకాశం లేకపోవడంతో పాటు కూకట్‌పల్లి నాలా నుంచి పెద్ద ఎత్తున వరద నీరు పైపులైన్ల నుంచి రివర్స్‌లో రావడంతో ఈ ప్రాంతం వరదలకు నిలయంగా మారింది. కుందన్‌బాగ్, లైఫ్‌స్టైల్ ప్రాంతాల నుంచి బేగంపేట రైల్వేస్టేషన్ పట్టాల కింద నుంచి బ్రాహ్మణవాడిలోకి వర్షం పడిన ప్రతీసారి భారీ ఎత్తున వర్షంనీరు వస్తుంది. దీంతో వర్షం నీరు వెళ్లేందుకు అవసరమైన పైపులైన్ లేకపోవడంతో ఈ వరదనీరు వడ్డెరబస్తీ, బ్రాహ్మణవాడిలోని పలు ఇళ్లను ముంచెత్తుతోంది.

ప్రత్యేక ఏర్పాట్లు చేయకపోవడం వల్లే..

బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎస్ఎన్‌డీపీ పథకం ద్వారా రూ.45 కోట్లతో నాలా అభివృద్ధి పనులు నిర్వహించారు. పనులు పూర్తయితే ఈ ప్రాంతంలో ముంపు సమస్య పూర్తిగా తొలగిపోతుందని అప్పట్లో ప్రజాప్రతినిధులు ప్రజలకు చెప్పారు. నాలా పనులు పూర్తయినా ఇక్కడ వారికి ముంపు సమస్య నుంచి విముక్తి లభించలేదు. ప్రధానంగా నాలా పక్కన ఉన్న వడ్డెరబస్తీ, బ్రాహ్మణవాడిలోని 1,2,3,4 లేన్స్‌లో పలు ఇళ్లలోకి ఇప్పటికీ వరదనీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం నీరు వెళ్లేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయకపోవడం వల్లనే ఇక్కడ వరదనీరు ఇళ్లలోకి వస్తున్నదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాలా బఫర్ జోన్లలోని నిర్మాణాలతోనే సమస్య

కూకట్‌పల్లి నాలాకు ఇరువైపులా ఉన్న బఫర్‌జోన్‌లో అక్రమ నిర్మాణాల వల్లే వర్షం నీరు వెళ్లే అవకాశాలు లేక తరచూ ఈ ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. నాలాను ఆనుకుని గతంలో ఇక్కడ భారీ భవనాలను నిర్మించారు. 2016 సెప్టెంబర్ 20వ తేదీ నుంచి రెండు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలకు ఈ ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. మయూరిమార్గంలో 5 అడుగుల మేర నీరు చేరడంతో వెనుక ఉన్న బస్తీలకు సంబంధాలు తెగిపోయాయి. నాలా పక్కన ఉన్న అల్లంతోటబావి ప్రాంతంలో వందలాది ఇళ్లు నీట మునిగాయి. స్థానికులతో పాటు సైన్యం రంగంలోకి దిగి వరదల్లో చిక్కుకున్న వారిని రిలీఫ్ క్యాంపులకు తరలించారు. వరదనీటిలో చిక్కుకున్న అల్లంతోటబావి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు మిలటరీ కమాండర్ అనుకోశ్‌పాండే నేతృత్వంలో సుమారు 35 మంది ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యల్లో అప్పట్లో పాల్గొన్నాయి. వరదముంపు నివారణకు ఈ ప్రాంతంలో ఉన్న నాలాల ఆక్రమణలను తొలగించాలని అప్పట్లో అధికారులు నిర్ణయించారు. అయితే, సర్వే చేసి మార్కింగ్ వేసి వదిలేశారు. నాలాకు బ్రాహ్మణవాడి వైపున, అల్లంతోటబావి వైపున ఉన్న ఆక్రమణలను గుర్తించిన ఇంజనీరింగ్ అధికారులు అప్పట్లో మార్కింగ్ చేశారు. ఇంత వరకూ ఆక్రమణలను తొలగించలేదు. దీనికి తోడు బ్రాహ్మణవాడి నుంచి మాతాజీనగర్ వరకు నాలా పొడవునా బఫర్ జోన్‌లో భారీ ఎత్తున నిర్మాణాలు వెలిశాయి. వీటిని తొలగించడంలోనూ అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం ప్రదర్శించడం వల్లనే ఇక్కడ వరద సమస్య తీవ్రంగా ఉందనే విమర్శలున్నాయి.

తల్లిదండ్రులు మందలించారని ముంబైకి వెళ్లబోయిన బాలిక

నాంపల్లి రైల్వే స్టేషన్‌లో చేరదీసిన ఆర్పీఎఫ్ పోలీసులు



బాలికను చేరదీసిన ఆర్పీఎఫ్ పోలీసులు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు మందలించారన్న నేపంతో ఓ బాలిక ఇంట్లో ఎవ్వరికీ చెప్పకుండా ముంబైకి వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా ఆర్పీఎఫ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నాంపల్లి ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కల్పన తెలిపిన వివరాల ప్రకారం.. హయత్‌నగర్‌కు చెందిన మహ్మద్ జాహంగీర్ కుమార్తె(17ను) తల్లిదండ్రులు మందలిస్తున్నారు. ఇంట్లో కుటుంబ సమస్యలు కూడా వెంటాడుతున్నాయి. దీంతో గురువారం బాలిక ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ముంబైకి వెళ్లేందుకు నాంపల్లి రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. ఆ సమయంలో పెట్రోలింగ్ చేస్తున్న ఆర్పీఎఫ్ పోలీసులు బాలిక వివరాలను తెలుసుకుని ప్రభుత్వ చైల్డ్‌లైన్ హోమ్‌కు తరలించారు. తల్లిదండ్రులకు కుమార్తెను అప్పగించేందుకు చైల్డ్‌లైన్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారని పోలీసులు తెలిపారు.

శ్రీలలితా త్రిపుర సుందరీదేవి దేవాలయానికి భూమి పూజ



బొల్లారం డౌటన్ బజార్‌లోని శ్రీహనుమాన్ దేవాలయంలో గురువారం ఉదయం శ్రీలలితా త్రిపుర సుందరీదేవి ఉప ఆలయానికి భూమిపూజ చేశారు. ఈఓ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో దాత పర్శ నిరంజన్ ఆయన సతీమణి పర్ష వెంకటరమణలు భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకుడు వేణుగోపాల్ శర్మ వేద పండితులు పాల్గొన్నారు.

- తిరుమలగిరి, (ఆంధ్రజ్యోతి)

● బీసీ వెల్ఫేర్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం



టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కే.నరసింహన్ బీసీ వెల్ఫేర్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఎస్.శ్రీకాంత్‌గౌడ్‌ను గురువారం కలిశారు. శాలువా కప్పి ఆయనను సత్కరించారు. వెనకబడిన తరగతుల వారికి రుణాలు మంజూరు చేయాలని శ్రీకాంత్ గౌడ్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ కార్యదర్శి అరవింద్, జీవీ.బాల్‌రాజ్, రషీద్, సతీష్ ఉన్నారు.

- తిరుమలగిరి ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి)

కల్యాణ మండపాలు కళకళ



కళకళలాడుతున్న కల్యాణ మండపం

చిలకలగూడ, ఆగస్ట్ 22, (ఆంధ్రజ్యోతి): గురువారం మంచి ముహూర్తం కావడంతో సికింద్రాబాద్‌లోని కల్యాణ మండపాలు వివాహాలతో కళకళ లాడాయి. కల్యాణ మండపాలకు విపరీతమైన డిమాండ్ ఉండటంతో ఆరునెలల ముందుగానే బుక్ చేసుకోవాల్సి వస్తోంది. శ్రావణ మాసం పెళ్లిళ్ల సీజన్ కావడంతో టెంట్ హౌస్‌లు, మంగళవాద్య కళాకారులు, పురోహితులు, కల్యాణ మండపాలకు విపరీతమైన డిమాండ్ నెలకొంది.

రెజిమెంటల్‌బజార్‌లోని లాడ్జిలో వ్యభిచారం

- రాత్రి నగ్నంగా బయటికి వచ్చిన విటుడు

అడ్డగుట్ట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గోపాలపురం పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న ఓ లాడ్జీ నుంచి బుధవారం రాత్రి నగ్నంగా బయటికి వచ్చిన విటులను చూసిన కాలనీవాసులు అసహనానికి గురయ్యారు. గోపాలపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రెజిమెంటల్‌బజారులోని గురుద్వార్ ఆలయం పక్కనే ఉన్న వినాయక లాడ్జి చుట్టూ కాలనీలు, ఇళ్లు ఉన్నాయి. వ్యభిచారానికి అడ్డాగా ఈ లాడ్జి మారిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇందులో ప్రతి రోజూ మధ్యరాత్రి వరకు వ్యభిచారం నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఈ లాడ్జి నుంచి ఓ విటుడు నగ్నంగా కాలనీలోకి రావడంతో బయటకూర్చున్న కాలనీ, బస్తీవాసులు భయానికి గురయ్యారు. స్థానికులు, కాలనీవాసులు వెంటనే గోపాలపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసునమోదు చేసుకున్న పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. వినాయక లాడ్జి నుంచి ఓ వ్యక్తి నగ్నంగా పారిపోయినట్లు విచారణలో వెల్లడి కావడంతో పోలీసులు లాడ్జి యజమానిపై చిన్నకేసు నమోదుచేసి పంపించారు. గతంలో ఇక్కడ లాడ్జిలో అసాంఘీక కార్యకలపాలు సాగుతున్నాయని పదేపదే స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని వారు వాపోయారు.

ఇంటి శుభ్రతతో వ్యాధులకు చెక్!



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో ఇంటిని శుభ్రంగా ఉంచుకోవాలని, లేకపోతే వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందంటున్నారు చెఫ్ కునాల్ కపూర్. ఇంటిని శుభ్రంగా ఉంచుకోవడానికి వినూత్న పద్ధతులను అనుసరించాలని సూచిస్తున్నారు. వేప నూనెతో ఫ్లోర్‌ను శుభ్రం చేయడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయంటున్నారు.

ఫ్లోర్ పొడిగా ఉండాలి

వర్షాకాలంలో తేమ అధికంగా ఉంటుంది. తేమ వాతావరణంలో కంటికి కనిపించని సూక్ష్మజీవులు అధికంగా వృద్ధి చెందే అవకాశాలున్నాయి. వీలైనంత వరకు ఫ్లోరింగ్ పొడిగా ఉండేలా చూసుకోవాలి. నునుపుగా ఉండే టైల్స్‌పై నీరు పడితే కాలు జారే ప్రమాదం ఉంటుంది. ఫ్లోరింగ్ తడిగా ఉంటే ఎప్పటికప్పుడు తుడిచివేయడం మంచిది.

డోర్ మ్యాట్స్..

చాలామంది వర్షాకాలంలో డోర్ మ్యాట్స్ తడిచిపోతాయని సరిగా వాడరు. ఈ సీజన్‌లో హెవీ డ్యూటీ రబ్బర్ డోర్ మ్యాట్ బయటవైపు ఉంచడంతోపాటు ఇంటి లోపల నీరు పీల్చుకునే డోర్ మ్యాట్ వాడటం వల్ల ఇల్లు శుభ్రంగా ఉంచుకోవచ్చు.

డాగ్ ప్రేమికులు జాగ్రత్త..

ఇటీవల కాలంలో చాలా మంది కుక్కలు లేదా పిల్లులను పెంచుతున్నారు. వర్షాకాలంలో వాటి కాళ్లు తడవడం వల్ల నేలపై మరకలు పడటంతోపాటు వాటికి అంటువ్యాధులు వచ్చే అవకాశాలున్నాయి. వాటి పాదాలు శుభ్రం చేయడంతోపాటు పెట్ ఫ్రెండ్లీ ఫ్లోర్ క్లీనర్ వాడాలి.

యాసిడ్, ఫినాయిల్

ఫ్లోర్‌పై మరకలు పోవడానికి కొంతమంది యాసిడ్, ఇల్లు శుభ్రం చేయడానికి ఫినాయిల్ వాడుతుంటారు. వాటివల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. కొంతమందికి చర్మ సమస్యలు లాంటివి రావచ్చు. అనారోగ్యం కలిగించే వాటిని వాడకుండా చర్మ ఆరోగ్యం పాడవకుండా ఉండే, ఘాటు వాసన లేని క్లీనర్స్‌ను వాడితే మంచిది.

● వర్షాకాలంలో మంచాలపై దుప్పట్లను వారాల తరబడి మార్చకపోతే సమస్యలు రావచ్చు. మీతోపాటు మీ పెట్స్ కూడా తాజాగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంటిలో ఎక్కడా నీరు నిల్వకుండా చూసుకోవాలి. వర్షాకాలంలో తడిచిన దుస్తులు వాసన వస్తుంటాయి. వాటిని ఆరబెట్టడానికి చర్యలు తీసుకోవాలి.

తలుపులు మూసి ఉంచొద్దు

దోమలు వస్తాయని, జల్లు పడుతుందని ఇంటి తలుపులు, కిటికీలను వర్షాకాలంలో మూసి ఉంచొద్దు. ఇంట్లో ఉన్న తేమ, ఇతర చెడు వాసనలు బయటకు పోవడానికి గాలి ప్రసరించడం అవసరం. ఇంట్లో తేమ నివారణకు హ్యూమిడిఫైయర్లు లేదా ఫ్యాన్లను వాడటం మంచిది.

అదానీ దోచుకున్న ఆస్తులు ప్రజలకు దక్కే వరకు పోరాటం

కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్



ఈడీ కార్యాలయం వద్ద ధర్నాకు తరలివెళుతున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

సికింద్రాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అదానీ దోచుకున్న ఆస్తులు దేశ ప్రజలకు దక్కే వరకూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ గురువారం ఈడీ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాకు పికెట్ నుంచి శ్రీణేష్ నాయకత్వంలో భారీ సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ దేశ సంపద దోపిడీకి గురికావద్దని, ఈ దేశ సంపద ఈ దేశ ప్రజలకే దక్కాలని రాహుల్ గాంధీ కొద్ది సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నారని అన్నారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర చేసిన రాహుల్‌గాంధీ ఈ దేశ సంపదను అదానీ లాంటి వారికి ప్రధాని మోదీ దోచిపెడుతున్న తీరును వివరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బద్రియాదవ్, వెంకటేష్, సంకి రవీందర్, తేజ్‌పాల్, సంజీవ, సదానంద్‌గౌడ్, సంతోష్‌యాదవ్, అష్రఫ్, నరేష్, శ్యాంసన్‌రాజు, జయప్రకాష్, వేణుగోపాల్, జ్యోతి పాల్గొన్నారు.

జీవిత ప్రతిస్పందనను రేకెత్తించేవి ఛాయాచిత్రాలే

బర్కత్‌పుర, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జీవిత ప్రతిస్పందనను రేకెత్తించేవి ఛాయా చిత్రాలేనని ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను గురువారం సజ్జనార్ సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఫొటో జర్నలిస్టులు తమ చుట్టూ ఉన్న ప్రకృతి, మానవీయ సంఘటనలు, సమాజం, సంస్కృతి, సంప్రదాయాలు, ప్రపంచం గురించి ప్రదర్శించిన చిత్రాలు అనుభూతిని కలిగించేలా ఉన్నాయన్నారు. విలువ, ఆధారిత జర్నలిజం కోసం యువ ఫొటో జర్నలిస్టులు కృషిచేయాలని సూచించారు. ఆర్టీసీ త్రూ ది లెన్స్ అనే థీమ్ మీద ఫొటోగ్రఫీ పోటీలు, ప్రదర్శన, ఉత్తమ చిత్రాలకు పురస్కారాల కార్యక్రమం రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం నిర్వహించాలన్నారు. ఇందుకు ఆర్టీసీ సహాయ సహకారం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు అనుమల్ల గంగాధర్, ఉపాధ్యక్షులు కిషోర్‌సింగ్, పి.రామ్మూర్తి, ప్రధాన కార్యదర్శి కె.ఎన్.హరి, కోశాధికారి అనిల్‌కుమార్ కర్నకోటి, కార్యవర్గ సభ్యులు ఎండీ. అలీముద్దీన్, గోపాల్, ప్రదర్శన నిర్వహణ కమిటీ కన్వీనర్ ఎమహేష్‌కుమార్, సభ్యులు పి.సురేంద్ర, ఎల్లేశా, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్‌కు వినతి పత్రం అందజేస్తున్న తేలుకుంట సతీష్‌గుప్తా తదితరులు

ఐదో వార్డులో నీటి సమస్యను పరిష్కరించాలి

సికింద్రాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఐదో వార్డులోని కాలనీల్లో మంచినీటి సమస్యను పరిష్కరించాలని సికింద్రాబాద్ కంటోన్మెంట్ ముఖ్యకార్యనిర్వహణాధికారి మధుకర్‌నాయక్‌ను వాసవీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకుడు తేలుకుంట సతీష్‌గుప్తా కోరారు. గురువారం పలు కాలనీల ప్రతినిధులతో కలిసి సతీష్‌గుప్తా మధుకర్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. 5వ వార్డులోని కాలనీల్లో ఐదు రోజులకోసారి మంచినీటి సరఫరా జరుగుతోందని సీఈఓకు వివరించారు. అది కూడా 45, 50 నిమిషాలపాటు లోప్రెషర్‌తో జరుగుతుండడంతో ప్రజలు నీటి కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రతి రోజూ నీటిని కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడుతున్నదని చెప్పారు. వార్డులోని అన్ని ఏరియాలకు రోజు విడిచి రోజు నీటి సరఫరా చేయాలని, ప్రెషర్ పెంచాలని మధుకర్‌నాయక్‌ను సతీష్‌గుప్తా కోరారు.



నూతనంగా ఎన్నికైన సంజీవపురం పద్మశాలీ సంఘం సభ్యులు

'సంజీవపురం పద్మశాలీ' నూతన కమిటీ

బౌద్ధనగర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): బౌద్ధనగర్ డివిజన్‌లోని సంజీవపురం పద్మశాలి సంఘం నూతన కమిటీ ఎన్నికైంది. ఎన్నికల అధికారి డాక్టర్ చిక్కాదేవదాస్ పర్యవేక్షణలో గురువారం సంజీవపురం కమ్యూనిటీహాల్‌లో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంజీవపురం పద్మశాలీ సంఘం అధ్యక్షుడిగా హనుమాండ్ల బాలరాజు, ప్రధానకార్యదర్శిగా తాటికొండ చంద్రశేఖర్, కోశాధికారిగా ఎస్ఎస్.చక్రధారి, ఉపాధ్యక్షులుగా వై.సత్యనారాయణ, ఎన్.నవీన్ కుమార్‌తో సంయుక్తకార్యదర్శులు, కార్యవర్గసభ్యులు, సలహాదారులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కార్యవర్గసభ్యులు మాట్లాడుతూ సంఘం అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం కృషిచేస్తామని తెలిపారు.



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సామల హేమ

ఇందిరానగర్‌కాలనీలో కార్పొరేటర్ పర్యటన

బౌద్ధనగర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ ఇందిరానగర్‌కాలనీలో గురువారం స్థానిక కార్పొరేటర్ సామల హేమ పర్యటించారు. సమస్యల గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ 2022 సంవత్సరం డిసెంబర్‌లో స్ట్రామ్ వాటర్‌లైన్ మంజూరైందని, కానీ కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టలేదని అన్నారు. కాంట్రాక్టర్‌కు టెండర్ రద్దు చేస్తామని జీహెచ్ఎంసీ అధికారులు నోటీసులు జారీచేయగా, త్వరలో పనులు మొదలు పెడతామని ఆయన తెలిపారని కార్పొరేటర్ తెలిపారు. సుమారు రూ.70లక్షల వ్యయంతో స్ట్రామ్ వాటర్‌లైన్ నిర్మాణపనులను చేపడుతున్నామని చెప్పారు. జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్, నాయకులు కరాటేరాజు, స్థానిక అధ్యక్షుడు నగరపు శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌లో సెల్‌ఫోన్ దొంగల అరెస్టు



సెల్‌ఫోన్ దొంగల్ని అరెస్టు చేసిన ఆర్పీఎఫ్ పోలీసులు

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు సెల్‌ఫోన్ దొంగలను సికింద్రాబాద్ డివిజన్ ఆర్పీఎఫ్ శక్తి టీమ్ కానిస్టేబుళ్లు పట్టుకున్నారు. బేగంపేట ఆర్పీఎఫ్ ఎస్సై నసీమా తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట్ - ఖమ్మం రైల్వే స్టేషన్ల మార్గమధ్యలో చార్మినార్ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణికుల నుంచి సెల్‌ఫోన్‌లను చోరీచేస్తున్న ఇద్దరిని పెట్రోలింగ్ చేస్తున్న సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ శక్తి నాగమ్మ టీమ్ కానిస్టేబుళ్లు గురువారం పట్టుకున్నారు. వీరి నుంచి సెల్‌ఫోన్‌ను నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

● డిప్యూటీ మేయర్‌ను కలిసిన శానిటేషన్ విభాగం డీఈ



తార్నాక డివిజన్ శానిటేషన్ విభాగం డీఈగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్ గురువారం జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్‌రెడ్డిని తార్నాకలోని తన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. - తార్నాక, ఆంధ్రజ్యోతి



విద్యార్థులకు హెల్మెట్ పంపిణీ చేస్తున్న ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు

ట్రాఫిక్ నిబంధనలను తెలుసుకోవాలి : ఏసీపీ

తిరుమలగిరి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చిన్నతనం నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించటంతోపాటు రోడ్డు భద్రతానియమాలపై ఉపాధ్యాయులు వివరించాలని ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు సూచించారు. గురువారం తిరుమలగిరిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేశారు. విద్యార్థులు చిన్నతనం నుంచే ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంచుకొని వాటిని పాటించాలని అన్నారు. ట్రాఫిక్ సిగ్నళ్ల గురించి వారికి వివరించారు. విద్యార్థులు బాగా కష్టపడి ఉన్నత చదువులు చదివి మంచి క్రమశిక్షణ అలవాటు చేసుకోవాలని సూచించారు.

రేపు ఈఎంఆర్ఐలో ఉద్యోగ ఇంటర్వ్యూలు

మేడ్చల్ టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఈఎంఆర్ఐ (108) సంస్థలో డ్రైవర్లు, మెడికల్ టెక్నీషియన్ల నియామకాలను చేపడుతున్నట్లు ఈఎంఆర్ఐ ప్రోగామ్ మేనేజర్ షేక్ జాన్ షాహీద్ తెలిపారు. ఈనెల 24న కింగ్‌కోఠి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని తమ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని తెలిపారు. డ్రైవర్ కోసం వయసు 23-35 సంవత్సరాలు, కనీసం 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. మెడికల్ టెక్నీషియన్ కోసం అభ్యర్థులు 30 సంవత్సరాల లోపు వయసు కలిగి ఉండాలని డీ ఫార్మసీ, నర్సింగ్‌తో పాటు ఇతర ఆరోగ్యశాఖకు సంబంధించిన డిప్లమా చదివి ఉండాలని తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికేట్లతో పాటు ఒక జత జీరాక్స్ సెట్‌ను తీసుకురావాలని తెలిపారు.

అందుబాటులోకి మెట్రో డీలక్స్ మంత్లీ పాస్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ జోన్ ప్రయాణికుల సౌకర్యార్థం గురువారం నుంచి మెట్రో డీలక్స్ మంత్లీ బస్‌పాస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు టీజీఎస్ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వర్లు తెలిపారు. పాస్‌తో మెట్రోడీలక్స్, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఈ-మెట్రో ఎక్స్‌ప్రెస్ నాన్ ఏసీ, సిటీ ఆర్డినరీ బస్సుల్లో ప్రయాణించవచ్చన్నారు. పాస్‌హోల్డర్లు సిటీ, సబర్బన్ పరిధుల్లో తిరిగే అన్ని బస్సుల్లో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ప్రయాణించవచ్చన్నారు.

బీసీ నిరుద్యోగ యువతకు 90 రోజుల శిక్షణ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఫ్రీ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ప్రోగ్రాం కింద బీసీ నిరుద్యోగ యువతకు 90 రోజులపాటు నాన్ రెసిడెన్షియల్ కింద శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి అధికారి ఆశన్న తెలిపారు. కుషాయిగూడలోని ఎల్‌జీ హోప్ టెక్నికల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1 నుంచి నవంబర్ 30 వరకు వంద మంది అభ్యర్థులకు ట్రైనింగ్ అందిస్తున్నట్లు చెప్పారు. శిక్షణ పూర్తయిన తర్వాత ప్లేస్‌మెంట్‌లు లభిస్తాయన్నారు. టెన్త్, ఇంటర్ పూర్తిచేసిన 18 నుంచి 25 ఏళ్లలోపు ఉన్న అభ్యర్థులు ఈనెల24లోపు www.tgbcstudycircle.cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.5 లక్షలలోపు ఉండాలని, ఎస్ఎస్‌సీ మార్కుల మెరిట్ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు.



విలేకరుల సమావేశంలో పాల్గొన్న ముదిరాజ్ నాయకులు

26న కృష్ణస్వామి జయంతి వేడుకలు

పద్మారావునగర్, ఆగస్ట్ 22, (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగర తొలిమేయర్ కొర్వి కృష్ణస్వామి జయంతి వేడుకలను ఈనెల 26వ తేదీన సికింద్రాబాద్‌లోని ముదిరాజ్‌భవన్‌లో ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సికింద్రాబాద్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిర్వాహకులు డి.సదానంద్, జి.దివాకర్, శ్రీకాంత్, సురేష్, నర్సింగరావులు మాట్లాడుతూ తెలంగాణ ముదిరాజ్ మహాసభ, కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ జయంతి మహోత్సవ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వేడుకకు ముఖ్య అతిథిగా తెలంగాణ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు, మాజీ శాసనసభ సభ్యుడు కాసాని జ్ఞానేశ్వర్ హాజరవుతారని తెలిపారు.